## క్లుప్తంగా

### టేబుల్ టెన్నిస్ పోటీలు

సుల్తానాబాద్: పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్ ఆవరణలో సోమవారం టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహించారు. టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కోడం అజయ్ అధ్యక్షతన పోటీలు నిర్వహించారు. మున్సిపల్ చైర పర్సన్ గాజుల లక్ష్మి పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 100 మంది విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు. ఇండియన్ పబ్లిక్ పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపల్ కృష్ణ ప్రియ, సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బొల్లి సత్యనారాయణ, కోశాధికారి గోపీకృష్ణ, సహాయ కార్యదర్శి ఇక్బాల్, పీఈటీలు ఆసియా, మధు తదితరులు పాల్గొన్నారు.

### నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో క్రీడాపోటీలు

జూలపల్లి: యువతకు క్రీడలపై ఆసక్తి పెంచేందుకు బ్లాక్ లెవల్ క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్రం వలంటీర్ మహేశ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఈనెల 18, 19ల్లో యువకులకు బ్లాక్ లెవల్ ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, రన్నింగ్, షాట్‌పుట్ క్రీడలుంటాయన్నారు.

### నైపుణ్యం పెంచుకోవాలి



విద్యార్థులకు బహుమతులు అందించిన ఉపాధ్యాయులు

జూలపల్లి: పాఠశాలల్లో ప్రత్యేక అవసరాలు గల పిల్లలు నైపుణ్యం పెంచుకోవడంలో ముందుండాలని మండల విద్యాధికారి సరస్వతి సూచించారు. పెద్దాపూర్ ఆదర్శ విద్యాలయంలో వరల్డ్ డిసెబుల్ డేను పురస్కరించుకొని విద్యార్థులకు పలు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యాలయ ప్రిన్సిపాల్ షాదూల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులున్నారు.

### ఉచిత వైద్యశిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యులు

కమాన్‌పూర్: జూలపల్లి గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని మెడికవర్ ఆస్పత్రి ఉచిత వైద్యశిబిరం నిర్వహించింది. వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వైద్యులు నాగరాజు, శ్రీకాంత్, గుర్రం కిరణ్, యాదవ సంఘం నాయకులు తిరుపతి, కొమురయ్య, సాయిశంకర్, శివ, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.


కాట్నపల్లిలో..



కాట్నపల్లిలో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

సుల్తానాబాద్‌రూరల్: కాట్నపల్లి గ్రామంలో సోమవారం గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. బీపీ, షుగర్ పరీక్షలను చేసి ఉచితంగా మందులిచ్చారు. క్షయ వ్యాధి నివారణపై ప్రచారం చేశారు. వైద్యురాలు ఫారహమకనున్, సూపర్‌వైజర్లు వెంకటరెడ్డి, రోజా, సురేందర్, ఏఎన్‌ఎం కవిత, ఆశ కార్యకర్తలున్నారు.

### బెల్టు షాపులతో ఇబ్బందులు



మాట్లాడుతున్న ముత్తారం వాసులు

ముత్తారం: ముత్తారంలో బెల్టు షాపులు విచ్చలవిడిగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ముత్తారానికి చెందిన మల్యాల రాజయ్య, అనుము సమ్మయ్య, శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ముత్తారం ప్రెస్ క్లబ్‌లో మాట్లాడారు. ఆబ్కారీ శాఖ అధికారులు, వైన్స్ షాప్ యజమానులు కుమ్మక్కయి ఎంఆర్‌పీల కన్న అధిక ధరలకు మద్యాన్ని అమ్ముతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

### ఏసుక్రీస్తు ప్రేమ, త్యాగం గొప్పది



కేక్ కట్ చేస్తున్న కుమార్

మంథని: ఏసుక్రీస్తు ప్రేమ, త్యాగం గొప్పదని ఐఎంఐ సెక్రటరీ అంకరి కుమార్ అన్నారు. ఎక్లాస్‌పూర్, నెల్లిపల్లి, సూరయ్యపల్లి గ్రామాల్లో సోమవారం క్రిస్మస్ క్యారల్స్ నిర్వహించారు. ఏసు మానవులపై చూపించిన ప్రేమ వెలకట్టలేనిదన్నారు. ఏసు బోధనలు అందరూ ఆచరించదగినవని అన్నారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పాస్టర్లు దూడ మహేశ్, మంథని మార్క్, అజ్మీరా దయరాజు, కలువల శామ్యూల్, గద్దల రాజేశ్, సంఘ పెద్దలు జోసెఫ్, ప్రసాద్, ప్రేమ్‌కుమార్, అందె రమేశ్, సదానందం పాల్గొన్నారు.

# ‘చి‘వరి’ దశకు ధాన్యం కొనుగోళ్లు

- మద్దతు ధరపైనే రైతుల ఆసక్తి
- తేమ శాతంతో కొంత ఇబ్బంది
- సన్న వడ్లకు బోనస్‌తో సంతోషం



ఎలిగేడులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు(ఫైల్)

ఎలిగేడు: రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ఖరీఫ్ వరి పంటలు చేతికి అందుతున్నాయి. మండలంలోని అన్ని గ్రామాల్లో ఖరీఫ్ వరి కోతలు దాదాపుగా చివరి దశకు చేరుకున్నాయి. వరికి ప్రభుత్వం మద్దతు ధరతో రైతులు పండించిన పంట నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి ధాన్యం విక్రయిస్తున్నారు. దీంతో కొనుగోలు కేంద్రాల్లో వరిధాన్యం కొనుగోళ్లు జోరుగా సాగుతూ చివరి దశకు చేరుకున్నాయి.

**మద్దతు ధర**

మండలంలోని ధూళికట్ట సింగిల్‌విండో పరిధిలో ధూళికట్టలో ముప్పిరితోట, లోకపేట గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఎలిగేడు ఐకేపీ ద్వారా ధూళికట్ట, సుల్తాన్‌పూర్, ఎలిగేడు, బుర్హాన్ మియాపేట, ముప్పిరితోట గ్రామాల్లో, ఎలిగేడు సింగిల్‌విండో ద్వారా ఎలిగేడు, నర్సాపూర్, నారాయణపల్లి, ర్యాకల్‌దేవుపలి, శివుపల్లి, లాలపల్లి, బుర్హాన్‌మియాపేట, రాములపల్లి, సుల్తాన్‌పూర్ గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కొనుగోలు కేంద్రాల్లో దొడ్డు రకం వరిధాన్యానికి ఏ గ్రేడు రకానికి క్వింటాల్‌కు రూ.2320, కామన్ రకానికి రూ.2300 ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది.

**సన్న రకం బోనస్‌పై రైతుల్లో ఆనందం**

ప్రజలు ఎక్కువగా సన్నరకం ధాన్యం బియ్యంగా మార్చి తినేందుకు వినియోగిస్తుండడంతో ఖరీఫ్‌లో ఎక్కువగా రైతులు సన్నరకం వరి వేశారు. అయితే సన్నరకం వరిధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధరతోపాటు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించి ఈ ఖరీఫ్ నుంచి రైతుల ఖాతాల్లో జమ చేస్తుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**ఇబ్బంది కలగకుండా కొనుగోళ్లు**



ఎలిగేడు సహకార సంఘం ఆధ్వర్యంలో ఎలిగేడు మండలంలో తొమ్మిది గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టి కొనుగోళ్లు నిర్వహిస్తున్నాం.
– గోపు విజయభాస్కర్‌రెడ్డి, ఎలిగేడు విండో చైర్మన్

**బోనస్ పడింది**



నాకున్న రెండెకరాల్లో పండించిన వరిధాన్యం ప్రభుత్వం నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించిన. అమ్ముకున్న ధాన్యానికి డబ్బులు ఖాతాలో పడటంతోపాటు సన్నరకం వడ్లకు రూ.13,600 బోనస్ సైతం ఖాతాలో జమ కావడం సంతోషంగా ఉంది.
– కొండ రవియాదవ్, యువ రైతు, ధూళికట్ట

### మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి



కూలీలకు దుస్తులు అందిస్తున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్

ధర్మారం: వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేస్తానని చైర్మన్ లావుడ్య రూప్లానాయక్ అన్నారు. మండల కేంద్రంలోని కమిటీ ఆవరణలో సోమవారం పాలకవర్గ సమావేశం జరిగింది. కమిటీలో పని చేస్తున్న హమాలీలు, ఆడ కూలీలు, దడ్వాయిలకు యూనిఫాం పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన పాలకవర్గ సమావేశంలో చైర్మన్ మాట్లాడారు. కమిటీ వైస్ చైర్మన్ అరిగే లింగయ్య, డైరెక్టర్లు అల్వాల రాజేశం, కాంపెల్లి రాజేశం, జనగామ తిరుపతి, బద్దం గంగారెడ్డి, ఎలగందుల అశోక్, మహేశ్, భూమయ్య, కోల శ్రీనివాస్, కార్యదర్శి సరోజ, అసిస్టెంట్ కార్యదర్శి సంధ్య, సిబ్బంది పాల్గొన్నారు.


### విధుల బహిష్కరణ



సుల్తానాబాద్ కోర్టు ఆవరణలో మౌనం పాటిస్తున్న న్యాయవాదులు

సుల్తానాబాద్: పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది కాసర్ల అనంతరెడ్డి మృతిపై సోమవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మౌనం పాటించారు. విధులను బహిష్కరించారు. పలువురు న్యాయవాదులు ఆయన సేవలను కొనియాడారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి రమేశ్, ఏజీపీ దూడం ఆంజనేయులు, పబ్బతి లక్ష్మీకాంతరెడ్డి, ఆవుల లక్ష్మిరాజం, మాడూరి ఆంజనేయులు, మేకల తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

### వేములవాడ సమాచారం



వేములవాడ రాజన్న సన్నిధిలో సోమవారం భక్తుల సందడి కొనసాగింది. సాయంత్రం 5 గంటల వరకు వసతి గదుల సమాచారం.

| కాంప్లెక్స్ పేరు | ఖాళీల సంఖ్య | అద్దె రూ. |
|---|---|---|
| అమ్మవారి కాంప్లెక్స్ | 0 | 1,680 |
| భీమేశ్వర సదన్ ఏసీ | 02 | 1,344 |
| భీమేశ్వర సదన్ సూట్స్ | 0 | 1,680 |
| భీమేశ్వర గెస్ట్‌హౌస్ | 0 | 2,800 |
| నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ | 04 | 1,008 |
| నందీశ్వర నాన్‌ఏసీ | 02 | 560 |
| నందీశ్వర సూట్స్ | 0 | 2,800 |
| లక్ష్మీగణపతి కాంప్లెక్స్ | 03 | 448 |
| పార్వతీపురం స్పెషల్ | 04 | 672 |
| పార్వతీపురం సాధారణ | 06 | 336 |

\- వేములవాడ

## హామీలు అమలు చేయకుంటే గుణపాఠం తప్పదు

సుల్తానాబాద్: హామీలు అమలు చేయకుంటే స్థానిక ఎన్నికల్లో గుణపాఠం తప్పదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండా థామస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వర్గీకరణను చేపట్టకుంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వానికి బుద్ధి చెబుతామన్నారు. మాదిగ ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు చందు ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్‌ఎఫ్ నూతన మండల కమిటీలను నియమించారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా రుద్రారపు శ్రవణ్, ఉపాధ్యక్షుడిగా ఏదుళ్ల ప్రవీణ్, ఎంఎస్పీ మండల అధ్యక్షుడిగా కనకం శంకర్, ఉపాధ్యక్షులుగా అట్లూరి గంగారం, ఎనుగందుల నాంపల్లి, ప్రధాన కార్యదర్శిగా మారుపాక కిష్టయ్య, ప్రచార కార్యదర్శులుగా కాల్వల రాజు, కవ్వంపల్లి శంకర్, ఎంఎస్‌ఎఫ్ మండల అధ్యక్షుడిగా ఇంజపురి వివేక్, గౌరవ అధ్యక్షుడిగా క్యాదాసి చంద్రమౌళి, సలహాదారుడిగా కొమ్ము ఓదెలు ఎన్నికయ్యారు.

### వ్యక్తిపై కేసు

యైటింక్లయిన్‌కాలనీ: స్కీం పేరుతో మహిళల వద్ద నుంచి డబ్బులు వసూలు చేసిన ధరవత్ రాజేశ్‌నాయక్ అనే వ్యక్తిపై సోమవారం గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రసాద్‌రావు తెలిపారు. రాజేశ్ కేంద్ర ప్రభుత్వ పథకం పీఎంఈఫ్ ఎంఈ పథకం పేరుతో స్థానిక సదానందం థియేటర్ బిల్డింగ్‌లో అన్నపూర్ణ ఫుడ్స్ పేరుతో సభ్యత్వం పేరిట మహిళల వద్ద నుంచి రూ.2,600 నుంచి 5,200 వరకు వసూలు చేసినట్లు పేర్కొన్నారు. ఐడీ కార్డు, ట్రైనింగ్ ఫీజు, యూనిఫాం పేరిట వసూలు చేసినట్లు తెలిపారు. హనుమాన్‌నగర్‌కు చెందిన భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

### శ్మశాన వాటికను వినియోగంలోకి తేవాలి



వినతిపత్రం అందిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని నూతుల కుంట వద్ద గతంలో ఏర్పాటు చేసిన శ్మశాన వాటిక, దోబీఘాట్లను వినియోగంలోకి తీసుకురావాలని బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం ఎంపీవో భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. తాటికొండ శంకర్, గుర్రం లక్ష్మిమల్లు, బొమ్మగాని అనిల్, తోట రాజ్‌కుమార్ ఉన్నారు.

## సింగరేణి వార్తలు

# ప్రతీక్షణం అప్రమత్తంగా ఉండాలి

- సీహెచ్‌పీల జనరల్ మేనేజర్ సూర్యనారాయణరాజు



రోలింగ్ షీల్డ్ అందిస్తున్న అధికారులు

గోదావరిఖని: ప్రతీక్షణం అప్రమత్తంగా ఉండి ఉత్పత్తి లక్ష్యాల సాధనలో అగ్రగామిగా నిలవాలని సింగరేణి ఓసీపీ, సీహెచ్‌పీల జీఎం సూర్య నారాయణరాజు సూచించారు. ఓసీపీ–1 సీహెచ్‌పీలో సోమవారం రక్షణ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సూర్యనారాయణరాజు మాట్లాడారు. విధులు నిర్వర్తించే సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో విలువైన ప్రాణాలు పోతున్నాయని తెలిపారు. ఉద్యోగి పనివేళల్లో ప్రతీక్షణం తన రక్షణ, తనతో పని చేసే వారి భద్రత కోసం ఆలోచించి అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈసందర్భంగా నిర్వహించిన రక్షణ నాటిక అలరించింది. కార్యక్రమంలో సింగరేణి ఏరియా ఇంజినీర్ శేఖర్‌బాబు, ప్రతినిధి విశ్వేశ్వరరావు, ప్రాజెక్ట్ అధికారి జింగిటి రాజశేఖర్, గని మేనేజర్ ఉదయ్‌హరిజన్ పాల్గొన్నారు.

## గనిలో యంత్రాల వినియోగం పెరగాలి



మాట్లాడుతున్న ఏపీఏ జీఎం కె.వెంకటేశ్వర్లు

రామగిరి: భూగర్భ గనుల్లో కంటే ఏపీఏ గనిలో అత్యుత్తమ టెక్నాలజీ గల యంత్రాలున్నాయని, వినియోగం పెంచి నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని ఏపీఏ జీఎం కొప్పుల వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం ఏపీఏ గనిలో నిర్వహించిన మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశాలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వార్షిక లక్ష్యాలను అధిగమించడంలో భాగంగా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ సమష్టి కృషితో నిర్దేశిత లక్ష్యాలను సాధించాలన్నారు. భద్రతతో కూడిన విధులు నిర్వహిస్తూ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించుకున్న 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించడానికి యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించి భద్రతతో కూడిన ఉత్పత్తిని సాధించడానికి కృషి చేయాలని అన్నారు. సింగరేణి సంస్థ సాధిస్తున్న ప్రగతి, నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించడానికి చేసిన ప్రణాళికల గురించి సంబంధిత అధికారులు పీపీటీ ద్వారా అవగాహన కల్పించారు. సంస్థ అభివృద్ధికి సంబంధించి పలువురు ఉద్యోగులు అందించిన సలహాలు, సూచనలను అధికారులు స్వీకరించారు. ప్రాజెక్టు అధికారి కొలిపాక నాగేశ్వరరావు, ఎస్‌వోటూ జీఎం బండి సత్యనారాయణ, ఫైనాన్స్ ఏజీఎం పి.శ్రీనివాసులు, ఐఈ డీజీఎం కె.చంద్రశేఖర్, ఇన్‌చార్జి పర్సనల్ విభాగాధిపతి గుర్రం శ్రీహరి, ఇన్‌చార్జి మేనేజర్ రమేశ్, సీనియర్ పీవో మతీన్ హుస్సేన్, అధికారులు ఎల్.రవిచంద్ర, విక్రమ్, పిట్ సెక్రటరీలు గంగాధర్, కొంరయ్య తదితరులు పాల్గొన్నారు.

### స్క్రాప్ దుకాణాల్లో తనిఖీ



స్వాధీనం చేసుకున్న స్క్రాప్

గోదావరిఖని: స్థానికంగా ఉన్న పలు స్క్రాప్ దుకాణాల్లో ఆర్జీ–1 సెక్యూరిటీ సిబ్బంది సోమవారం తనిఖీలు నిర్వహించారు. సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి, జూనియర్ ఇన్‌స్పెక్టర్ ఉమేశ్, చంద శ్రీనివాస్ ఆధ్వర్యంలో తనిఖీ నిర్వహించి 1050 కిలోల స్క్రాప్ స్వాధీనం చేసుకున్నారు. స్క్రాప్ విలువ రూ.20వేలుంటుందన్నారు.

### విజిలెన్స్ కేసులు పరిష్కరించాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

రామగిరి: సింగరేణి సంస్థలో డిపెండెంట్ ఉద్యోగాల కోసం పెండింగ్‌లో ఉన్న విజిలెన్స్ కేసులు పరిష్కరించాలని బీజేపీ మండల అధ్యక్షుడు ములుమ్మారి శ్రీనివాస్ అన్నారు. సోమవారం సెంటినరికాలనీలో మాట్లాడారు. కొన్ని సంవత్సరాలుగా విజిలెన్స్ కేసులతో కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డా పట్టించుకునేవారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ అన్‌ఫిట్ అయిన తర్వాత కారుణ్య నియామకం ద్వారా కుటుంబ సభ్యులకు ఉద్యోగమిచ్చేందుకు మీ పేర్లు తప్పుగా ఉన్నాయని తెలుపుతూ ఉద్యోగాలివ్వడం లేదన్నారు. నాయకులు మెరుగు శ్రీకాంత్, కందుల రమేశ్, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

### స్తూపం కూల్చివేత సరికాదు



నిరసన తెలుపుతున్న నాయకులు

గోదావరిఖని: తమ నేత దివంగత రాములు స్థూపాన్ని కూల్చివేయడం సరికాదని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కె.రాజన్న, ఐఎఫ్‌టీయూ అధ్యక్షుడు ఇ.నరేశ్ అన్నారు. స్థానిక పైలాన్‌వద్ద సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డారు. 2004లో తమ నేత రాములు హత్యకు గు రయ్యారని, రాయన జ్ఞాపకార్థం స్థూపం నిర్మించామని అన్నారు. కార్మికవర్గం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, హక్కులకు సాధన కోసం, ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, కార్మిక విధానాల వ్యతిరేకంగా నిరంతరం పోరాటాలు చేశా రని గుర్తు చేశారు. అలాంటి పోరాట యోధుడి స్థూపాన్ని అభివృద్ధికి అడ్డుగా ఉందనే కారణంతో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తొలగించడం ఏమిటని ప్రశ్నించారు. ఇక్కడి స్థూపం తొలగిస్తే మరోచోట నిర్మించుకునేందుకు అవకా శం ఇవ్వాలని కలెక్టర్, మున్సిపల్ అధికారులకు లేఖలు రాసినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన చెందారు. ఈనిరసన కార్యక్రమంలో నాయకులు బి.అశోక్, చిలుక శంకర్, ఎం.దుర్గయ్య, బుచ్చయ్య, మల్లేశం, తిరుపతి, సాంబయ్య, రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

### ప్రశాంతంగా గ్రూప్‌-2 పరీక్షలు



సుల్తానాబాద్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీవాణి జూనియర్ కళాశాలలో గ్రూప్‌–2 పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. సోమవారం పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. సీఐ సుబ్బారెడ్డి, ఎస్సై శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం 864 మందికి గాను 353 మంది, మధ్యాహ్నం 864 మందికి గాను 353 మంది హాజరైనట్లు అధికారులు ప్రకటించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు.

### శివుడికి రుద్రాభిషేకం



సుల్తానాబాద్: పట్టణంలోని పలు శివాలయాల్లో పలువురు వ్యాపారులు రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, కాసం సత్యనారాయణ లిఖిత, రావికంటి భూమన్న, దీకొండ భూమేశ్, భవాని పాల్గొన్నారు

జూలపల్లి: మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పవిత్ర ధనుర్మాస ప్రారంభ రోజు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పూజారి ఉద్దండ నవీన్ రుద్రాభిషేకం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు దారబోయిన నర్సింహయాదవ్ భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

### శబరిమలకు స్వాములు




ఇరుముడితో స్వాములు

సుల్తానాబాద్: పట్టణంలోని శాస్త్రినగర్ హనుమాన్ ఆలయంలో అయ్యప్ప స్వాములు సోమవారం ఇరుముడి కట్టుకొని శబరిమల తరలివెళ్లారు. ఓం శ్రీ స్వామియే శరణమయ్యప్ప.. స్వామి శరణం.. అయ్యప్ప శరణమంటూ రామగుండం రైల్వే స్టేషన్ నుంచి రైలులో వెళ్లారు.

### ఒలింపిక్ సంఘం ప్రతినిధికి సన్మానం

సుల్తానాబాద్: రాష్ట్ర ఒలింపిక్ సంఘం కార్యవర్గ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన జూడో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిలివెరి మహేందర్‌ను సోమవారం ఘనంగా సన్మానించారు. కరీంనగర్, సుల్తానాబాద్‌లో వేరువేరుగా కలిసి ఘనంగా పూల మాల, శాలువాతో సత్కరించారు. స్వీట్లు తినిపించారు. భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలని ఆశీర్వదించారు. జిల్లా పెటా సంఘం ప్రధాన కార్యదర్శి దాసరి రమేశ్, జిల్లా బేస్‌బాల్ సంఘం ఉపాధ్యక్షుడు బిత్ర శ్రీనివాస్, కరీంనగర్ జిల్లా పేటా సంఘం ప్రధాన కార్యదర్శి ఎండీ యూనిస్ పాషా, సీనియర్ క్రీడాకారులు చారన్న, బుర్ర శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సుల్తానాబాద్‌లో మహేందర్‌ను సన్మానిస్తున్న రమేశ్

ధర్మారం: మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం యువజన అధ్యక్షులను ఘనంగా సన్మానించారు. ధర్మపురి యువజన అధ్యక్షుడు అజయ్, యువజన మండల అధ్యక్షుడు సోగాల తిరుపతి, ప్రధాన కార్యదర్శి పాలకుర్తి సాయిని సత్కరించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్, వైస్ చైర్మన్ అరిగే లింగయ్య, నాయకులు కల్లెం గంగారెడ్డి, దేవి లావణ్య, డైరెక్టర్లు పాల్గొన్నారు.

### సీఎం చిత్రపటాలు పంపిణీ



కాల్వశ్రీరాంపూర్‌లో ఎంపీడీవోకు సీఎం చిత్రపటం అందిస్తున్న సారయ్యగౌడ్

కాల్వశ్రీరాంపూర్: కాంగ్రెస్ పార్టీ సర్కార్ ప్రజా సంక్షేమ పాలనతో ప్రజల అభిమానాన్ని చురగొనడంతో సీఎం రేవంత్‌రెడ్డిని అభిమానిస్తున్నారని, ముఖ్యమంత్రి చిత్రపటాన్ని ఇళ్లలో పెట్టుకుంటున్నారని మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య అన్నారు. సోమవారం సీఎం చిత్రపటాలను ప్రభుత్వ, పంచాయతీ కార్యాలయాల్లో పంపిణీ చేశారు. చదువు రాంచంద్రారెడ్డి, రామిడి తిరుపతిరెడ్డి, సబ్బని రాజమల్లు, మాదాసి సతీశ్, అనిల్‌రావు, బంగారి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.